## సార్వత్రిక సమ్మె బుక్‌లెట్ ఆవిష్కరణ

రామగిరి, మే 13 : ఈ నెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి బుక్‌లెట్‌ను సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ మేరకు ఆర్జీ-3 ఓసీపీ-2 ప్రాజెక్టులో మంగళవారం సీఐటీయూ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య ఆవిష్కరించి మాట్లాడారు. వందేళ్లుగా దేశంలోని కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను యాజమానులకు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, అవి అమల్లోకి వస్తే 8 గంటల పని దినం పోయి 12 గంటలుగా మారుతుందన్నారు. సమ్మె హక్కు కూడా పోతుందన్నారు. పీఎఫ్, బోనస్, గ్రాడ్యుటీ, సెలవులు లాంటి కార్మిక సంక్షేమ చర్యలు నిర్వీర్యం అవుతాయన్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, రైల్వే, బ్యాంకులు, ఆర్‌ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమలు ప్రైవేటీకరణ అవుతాయన్నారు. ఈ దేశ వ్యాప్త సమ్మె ప్రాధాన్యతను గుర్తించి కార్మికులు తప్పక పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, శ్రీనివాస్ ఉన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, మే 13 : ఒడిసా రాష్ట్రం ఐఐహెచ్‌టీలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ ఉప సంచాలకుడు కే విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిసా రాష్ట్రం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ నందు మొదటి సంవత్సరం 2025-26 గానూ తెలంగాణ రాష్ట్రానికి 9 సీట్లు కేటాయించారని తెలిపారు. చేనేత టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది, 17 -25 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తును చేనేత జౌళి శాఖ కరీంనగర్ కార్యాలయంలో వచ్చేనెల 5లోగా సమర్పించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LONG TERM COACHING
★BiPC-NEET & MPC-IIT Longterm Coaching Starts on June 1st, Sri Chaitanya Jr. College, Hyderabad Contact K. Askoh Reddy, AO-9441884705
NTK-0000

CHANGE OF NAME
I, Kolluri Vasantha having Passport No: V5844545, wife of Tharala Ganesh residing at H.No 5-11/1, Chelgal, Jagitial, Telangana, I hereby declare that I have changed my surname after marriage and shall henceforth be known as Tharala Vasantha for all official and legal purposes. All relevant documents shall reflect this change accordingly.

పేరు మార్చబడినది
నేను కొల్లూరి వసంత, పాస్‌పోర్ట్ నెం: V5844545 కలిగి ఉన్నాను, తెలంగాణలోని చెల్గల్, జగిత్యాల, H.No. 5-11/1లో నివసిస్తున్న తరాల గణేష్ భార్యని, వివాహం తర్వాత నా ఇంటి పేరును మార్చుకున్నానని మరియు ఇకపై అన్ని అధికారిక మరియు చట్టపరమైన ప్రయోజనాల కోసం తరాల వసంత అని పిలువబడతానని ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను. సంబంధిత పత్రాలన్నీ ఈ మార్పును తదనుగుణంగా ప్రతిబింబిస్తాయి.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

# చీపుర్లకు పైసల్లేవట

- బీఆర్ఎస్ హయాంలో నెలకు నాలుగు..
- ఇప్పుడు ఆరు నెలలకు మూడేనట..
- సొంత డబ్బులతో కొంటున్న పారిశుధ్య కార్మికులు
- పనిముట్లు, నిత్యావసర సరుకులు అడిగితే దబాయింపులు
- అధ్వానంగా రామగుండం బల్దియా దుస్థితి



రామగుండం కార్పొరేషన్ కార్యాలయం

కోల్‌సిటీ, మే 13: పేరు గొప్ప.. ఊరు దిబ్బ.. అన్నట్టు ఉంది రామగుండం నగరపాలక సంస్థ పరిస్థితి. పదేళ్లలో బ్రహ్మాండమైన పురోగతితో సాగిన కార్పొరేషన్‌లో ప్రస్తుతం చీపుర్లు కొనేందుకే దిక్కులేని దుస్థితికి వచ్చింది. పనిముట్లు, నిత్యావసర సరుకులు అడిగితే చీవాట్లు.. దబాయిస్తున్నారు. నాటి ప్రభుత్వం డ్రైన్ క్లీనర్లకు ఆటో డ్రైవర్లుగా పదోన్నతి కల్పిస్తే.. ఇప్పుడు వారు డ్రైన్ క్లీనర్లుగా డీప్రమోట్ పొందుతున్నారు. జోన్ల మార్పిడి పేరుతో మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. ఇదేంటని అడిగితే ఏకంగా విధుల నుంచే తొలగిస్తున్నారు. ఇక మహిళా పారిశుధ్య కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతినెల నాలుగు చీపుర్లు కొనిస్తే.. ఇప్పుడు ఆరు నెలలకోసారి మూడు చీపుర్లే ఇస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సొంత డబ్బులతో చీపుర్లు కొనుక్కునే పరిస్థితి వచ్చిందంటూ మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మొదలైన శ్రమదోపిడీ

పదేండ్ల క్రితం రామగుండం కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులు దర్జాగా బతికారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి, దసరా అడ్వాన్స్‌లు కూడా ఇచ్చారు. కార్మికులపై పనిఒత్తిడి తగ్గించేందుకు ఏటా బల్దియాకు రూ.100కోట్లు కేటాయించారు. వీటితో అత్యాధునిక యంత్రాలు కొనుగోలు చేశారు. పదేండ్లలో ఎంతో పురోగతి సాధించారో.. ఇప్పుడు అదే వేగంతో మళ్లీ వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. పారిశుధ్య కార్మికులపై మళ్లీ శ్రమదోపిడీ పెరుగుతోంది. ఔట్ సోర్సింగ్ కార్మికులు ఐదు నెల నుంచి తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నారు. అనారోగ్య సమస్య వచ్చినా విధులకు రావల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. పని దినాలకు వేతనాలు తక్కువ వచ్చాయని పారిశుధ్య కార్మికులు, అసలు వేతనాలు రాలేదని నర్సరీ కార్మికులు అధికారులను అడిగితే ఎదురుగా చీవాట్లు, దబాయింపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గాపని చేసిన ఐఏఎస్ స్థాయి అధికారి ఉదయ్ కుమార్ కార్పొరేషన్‌లో చాలా మార్పులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా డ్రైన్ క్లీనర్ల నుంచి ఆటో డ్రైవర్లుగా పదోన్నతి కల్పించారు. కొంత మందిని మొకద్దాం (జవాన్)లుగా పదోన్నతి కల్పించారు. ఇప్పుడు అదే మొకద్దాంలను డీ ప్రమోట్ చేస్తూ మళ్లీ డ్రైన్ క్లీనర్లుగా పనులు చేయిస్తున్నారు. ఏలాంటి కారణాలు లేకుండా జోన్ల మార్పిడితో మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత నెలలో ఇద్దరు సూపర్‌వైజర్లు సంగ వెంకటస్వామి, బైరి రాజాబాబును అకారణంగా విధుల నుంచి తొలగించినట్లు వివాదం నెలకొన్నది.

### చీపుర్లకూ దిక్కులేని దుస్థితి

మహిళా పారిశుధ్య కార్మికులకు కనీసం చీపుర్లు సమకూర్చలేని స్థితికి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో నెలకు నాలుగు చీపుర్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆరు నెలలకోసారి మూడు చీపుర్లు మాత్రమే ఇస్తున్నారని, గత్యంతరం లేక సొంత డబ్బులతో చీపుర్లు కొంటున్నట్లు మహిళా కార్మికులు వాపోతున్నారు. అధికారులకు చెబితే పట్టించుకోవడం లేదంటున్నారు. ఔట్ సోర్సింగ్, పీహెచ్ కార్మికులకు పని ముట్లతోపాటు రెండేళ్లుగా రావాల్సిన బట్టలు, చెప్పులు, నూనె, బెల్లం, యూనిఫాం కుట్టుకూలీ కూడా ఇవ్వడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. పండుగ సెలవులు, ఆదివారాలు కూడా రద్దుచేసి శ్రమదోపిడీకి గురి చేస్తున్నట్లు వాపోతున్నారు. వివిధ జోన్లలో పారిశుధ్య కార్మికులను కుదించి హెచ్‌కేఆర్ సంస్థ చేయాల్సిన పనులను మున్సిపల్ కార్మికులతో చేయిస్తున్నారు.

### సొసైటీలో అవినీతి పురుగు

కార్పొరేషన్ సొసైటీ అధ్యక్షుడి కాల పరిమితి ఆరు నెలలుగా నిర్ణయించినా.. చాలా కాలంగా ఎన్నికల్లేవు. కార్మికుల పేరు మార్పు, రుణాలు, తీర్మానాలలో పలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై సొసైటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ఇప్పటికీ చర్యలు లేవు. అధ్యక్షుడిని మార్చి సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఒక కార్మికుడి ఆత్మహత్యాయత్నంకు కారణమైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌ను అప్పుడు డీ ప్రమోట్ చేసి, ఇటీవల మళ్లీ నియమించడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు విధుల్లో ఉండాల్సిన పరిస్థితి రావడంతో ఇదెక్కడి గోస అనుకుంటూ కార్మికులు తలలుబాదుకుంటున్నారు.

# ఖనిలో 18న మెగా జాబ్ మేళా

గోదావరిఖని, మే 13 : గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు, సింగరేణి సీఎండీ బలరాం సూచనతో ఈ నెల 18న గోదావరిఖని కమ్యూనిటీహాల్ మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చెపడుతున్నట్లు సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సోసైటీ సౌజన్యంతో చెపట్టనున్న ఈ జాబ్‌మేళాకు వంద కంపెనీలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఐటీ హార్డ్‌వేర్, రిటైల్, హాస్పిటల్ డ్యూటీ, సెక్యూరిటీ జాబ్స్ హైదరాబాద్‌లో కల్పిస్తారన్నారు. అభ్యర్థుల కనీస అర్హత ఏడోతరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్, వయస్సు 18 ఏండ్ల నుంచి 30 ఏండ్ల లోపు ఉండాలన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల్ జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. జాబ్‌మేళాకు స్థల పరిశీలన మెగా జాబ్‌మేళా నిర్వహణకు ఆర్జీ-1 జీఎం ఆధ్వర్యంలో అధికారుల బృందం కమ్యూనిటీహల్, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంను పరిశీలించారు. కమ్యూనిటీహాల్ స్థానికంగా ఆర్టీసీ బస్టాండ్, మెయిన్‌రోడ్‌కు దగ్గరతో జాబ్‌మేళాకు కమ్యూనిటీహాల్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జీఎం జాబ్ మేళా విజయవంతం కోసం అధికారులు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. అన్ని గనుల సంక్షేమాధికారులు జాబ్‌మేళాకు ఉద్యోగుల పిల్లలు హాజరయ్యేలా చూడాలన్నారు. రామగుండం 1, 2, 3 ఏరియాలు, పెద్దపల్లి, మంచిర్యాల్ జిల్లాల నుంచి దాదాపు 10వేల మంది నిరుద్యోగులు పాల్గొంటారని వారికి సరిపడా షామియానాలు, చల్లదనం కోసం కూలర్స్, తాగునీటి వసతి, హెల్ప్‌డెస్క్ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇంటర్వ్యూల కోసం ప్రత్యేక సెల్స్, మంత్రులు, ఉన్నతాధికారులకు సరిపడా వేదిక ఏర్పాట్లు చేయాలని జీఎం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్ సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయప్రసాద్, డీజీఎం వర్క్‌షాప్ జితేందర్‌సింగ్, డీజీఎం వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, అధికారులు డెనిల్‌కుమార్, వీరారెడ్డి, నాయకులు రంగు శ్రీనివాస్, పొలసాని శ్రీనివాస్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, గట్ల రమేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్

## ఎన్టీపీసీలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు

జ్యోతినగర్, మే 13: రామగుండం ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఉద్యోగులకు యాజమాన్యం మంగళ వారం రాత్రి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని మహాత్మగాంధీ స్టేడియంలో ప్రీమియర్ లీగ్ మ్యాచ్ పోటీలు చేపట్టింది. ఈ పోటీలకు ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. టోర్నమెంట్‌లో పది లీగ్ మ్యాచ్‌లకు గాను 40మంది ఉద్యోగ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ నెల 19న పోటీలు గ్రాండ్ ఫైనల్‌కు చేరనున్నాయి. ఇక్కడ రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ జీఎంలు అలోక్‌కుమార్ త్రిపాఠి, ముఖుల్ రాజ్ తదివతరులున్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ఈడీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య

# పాలిసెట్ పరీక్షలు ప్రశాంతం

- 2488 మందికి 2366 మంది హాజరు
- గైర్హాజరైన 122 మంది విద్యార్థులు
- హాజరు 95 శాతం నమోదు

పెద్దపల్లి రూరల్, మే 13 : పాలిసెట్-2025 పరీక్షల కోసం మండలంలోని పట్టణాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ మేరకు మంగళవారం మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీకళాశాల, పెద్దబొంకూర్‌లోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు పెద్దపల్లి పట్టణంలోని పలు కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాల్లో బాలురు 1336 మంది, బాలికలు 1152 మందితో మొత్తం 2,448 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 1275 మంది బాలురు, 1091 మంది బాలికలతో 2366 మంది హాజరు కాగా, 122 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు కాగా, 95 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధాకారులు తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కో ఆర్డినేటర్ కే లక్ష్మీనర్సయ్య సందర్శించి, విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు కాకుండా పాలిసెట్-2025 పరీక్షలు ప్రశాంతంగా ముగాశాయని జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య తెలిపారు.

# ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం



స్వామి వారి రథాన్ని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మారం, మే 13 : మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం (జాతర) మంగళవారం ఘనంగా నిర్వ హించారు. దేవాదాయ ధర్మా దాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 13 వరకు ఆలయం ఆవరణలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఉదయం ఆలయ అర్చకులు రథంపై లక్ష్మీదేవి, నృసింహస్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలు పెట్టి పూజలు చేసి, రథాన్ని లాగడంతో జాతర ఉత్సవాలు మొదలయ్యాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, ఏఎంసీ చైర్మన్ లావుడ్యా రూప్లానాయక్ స్వామి వారిని దర్శించుకోగా, ఆలయ ఈవో కొస్న కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పోలుదాసరి సంతోష్, ఆలయ ధర్మకర్తలు స్వాగతం పలికి వారిని సన్మానించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. పిరమిడ్ స్పిరిచ్‌వల్ సొసైటీ పూజ్యశ్రీ బ్రహ్మర్షి పితామహ పత్రిజీ సొసైటీ ఆధ్వర్యంలో భక్తులకు 1,500 లీటర్ల మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కాకుండా పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.

# కార్మికులను తొలగిస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కోల్‌సిటీ, మే 13: రామగుండం కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను విధుల్లో నుంచి తొలగిస్తే ఊరుకునేది లేదని, అనేక ఆరోపణలు ఉన్న కిరణ్‌కుమార్‌కు మళ్లీ పదోన్నతి కల్పించి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించడం సరికాదని, వెంటనే ఆయనను ఇతర శాఖలకు బదిలీ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో మంగళవారం కార్మికులతో జరిగిన సమావేశంలో వారు డిమాండ్ చేశారు. ఇటీవల విధుల నుంచి తొలగించిన రాజబాబు, వెంకటస్వామిలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, రాజీవ్ రహదారి పనులను మున్సిపల్ కార్మికులతో చేయించవద్దని, మార్చి నెలలో థంబ్, ఐరీష్ సరిగ్గా లేదని సుమారు వంద మంది కార్మికులకు రూ.4 లక్షల వేతనాలు కోత విధించారని, ఎలాంటి ఎన్నికలు లేకుండా సొసైటీ నామినేటెడ్‌గా ఉన్న అధ్యక్షుడిని తొలగించి ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌ను ఇతర శాఖకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి మహిళా కార్మికులపై అనుచితంగా వ్యవహరిస్తున్నందున చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులపై ఇన్‌చార్జి కమిషనర్ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు నడిపెల్లి మురళీధర్, యాకయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెతో మోదీ సర్కారుకు బుద్ధి చెప్పాలి

**గేట్ మీటింగ్‌లో జేఏసీ సంఘాల నాయకులు**

గోదావరిఖని, మే 13 : ఈనెల 20న జరుగు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణిలో సమ్మెను విజయవంతంతో మోదీ సర్కారుకు బుద్ధి చెప్పాలని సింగరేణి జేఏసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జీడీకే1 ఇంక్లైన్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో జేఏసీ నాయకులు ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, ఐఎన్టీయూసీ నాయకులు గుండేటి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మెండె శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు కే విశ్వనాథ్ పేర్కొన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. దీంతో కార్మికవర్గం అనుభవిస్తున్న హక్కులు హరించిపోతాయన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలన్నారు. ఈ సమ్మెలో పాల్గొనవద్దని బీఎంఎస్ ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్యగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సంఘాల నాయకులు కవ్వంపల్లి స్వామి, సంకె అశోక్, ఎంఏ గౌస్, మానాల శ్రీనివాస్, తిరుపతి, రాజేశ్, పడాల కనకరాజు, చేరాలు, సారయ్య, రంగు శ్రీను, వడ్డెపల్లి శంకర్, రాజమౌళి, సురేశ్, రమేశ్‌కుమార్ ఉన్నారు.



గేట్‌మీటింగ్‌లో జేఏసీ సంఘాల నాయకులు

## పిల్లల ప్రవర్తనపై నిఘాపెట్టాలి

పెద్దపల్లి కమాన్, మే 13 : తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎల్లప్పుడూ నిఘా పెట్టాలని షీటీం ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య అన్నారు. పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం పాలిసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల ముందు షీటీం సభ్యులు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని, వారు మొబైల్స్‌ను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ, సైబర్ నేరాలకు గురికాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ముందుగానే జాగ్రత్త పడాలన్నారు. విద్యార్థునులను ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే పోలీసులను ఫిర్యాదు చేసేలా కుటుంబసభ్యులు ధైర్యం నింపాలన్నారు. షీ టీం సభ్యులు స్నేహలత, మౌనిక, సురేశ్ ఉన్నారు.

## గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఎలిగేడు, మే 13 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సమస్యల పరిష్కారం కోసం 'భూ భారతి' నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని రెవెన్యూ గ్రామసభలను నిర్వహించారు. ఈ నెల 5 నుంచి మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 818 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. అధికారులు మంగళవారం ర్యాకల్‌దేవ్‌పల్లి, శివపల్లి, లోకపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. గిర్దావర్ జయలక్ష్మి, చంద్రశేఖర్, ప్రవీణ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్, మే 13 : చెరువు మట్టిని లారీల్లో ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారని గ్రామస్తులు లారీలను అడ్డుకున్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామంలోని శనిగకుంటలో నుంచి ప్రభుత్వ అనుమతులకు మించి మట్టిని తరలిస్తున్నారని మంగళవారం గ్రామస్తులు గ్రామంలోని జెండా చౌరస్తా వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, లారీల్లో ఓవర్ రోడ్డుతో మట్టిని తరలించడంతో గ్రామంలోని రోడ్డు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఘటనా స్థలానికి చెరుకొని లారీలను అడ్డుకోవద్దన్నారు. ఏదైన ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడుకోవాలని ఎస్ఐ గ్రామస్తులకు సూచించారు.

## ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ

సుల్తానాబాద్‌రూరల్, మే 13 : గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో జిల్లాలోని (అంగ్లం సబ్జెక్ట్)ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా విద్యా శిక్షణ కళాశాల, ఈఎల్‌టీసీ ఆఫీసర్, ప్రోగ్రాం పరిశీలకుడు సీహెచ్ ప్రద్యుమ్నకుమార్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో వస్తున్న సాంకేతిక మార్పులకనుగుణంగా బోధన మెలకువలు ఈ కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలో అందించనున్నట్లు తెలిపారు. ఏంఈవో రాజయ్య, ప్రిన్సిపాల్ బల్బీర్ కౌర్ ఉన్నారు.

## రెస్ట్‌షెల్టర్‌లో ఏసీకి అనుమతి ఇవ్వాలి

గోదావరిఖని, మే 13 : సింగరేణి ఆర్జీ-1 ఏరియా ఓసీపీ 5లోని ఈపీ ఆపరేటర్ల రెస్ట్‌షెల్టర్‌లో ఏసీ ఏర్పాటుకు అనుమతివ్వాలని మంగళవారం ప్రాజెక్టు మేనేజర్‌కు రిలేసికి చెందిన ఈపీ ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా రెస్ట్‌షెల్టర్‌లో ఫ్యాన్‌గాలితో ఆపరేటర్ అస్వస్థతకు గురవుతున్నారని, తమ సొంత ఖర్చులతో ఏసీని ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఏఐటీయూసీ ప్రాజెక్టు కార్యదర్శి ప్రభుదాస్, సీనియర్ నాయకులు గండి ప్రసాద రాయు డు శ్రీనివాస్, చింతపండు సత్యనారాయణ, ఈపీ ఆపరేటర్లు ఉన్నారు.


## గుర్తింపు సంఘంతో నిర్మాణాత్మక సమావేశం

రామగిరి, మే 13 : సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో మంగళవారం జీఎం కార్యాలయంలో నిర్మాణాత్మక సమావేశం జరిగింది. ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు, ఏపీఏ జీఎం నాగేశ్వరరావుతో యూనియన్ కార్యదర్శి రాంచంద్రారెడ్డి చర్చించారు. ఓసీపీలో ఖాళీగా ఉన్న టెక్నిషియన్లను, సూపర్‌వైజర్లను అడ్రియాల ప్రాజెక్టులో పని చేస్తున్న సీనియర్ టెక్నిషియన్లకు అవకాశం కల్పించడం, లాంగ్‌వాల్‌లో పని చేస్తున్న వారికి గమ్ షూస్ ఇవ్వడం, నూతన ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీల కొనుగోలు, లాంగ్‌వాల్ గని కార్మికులకు అలవెన్సులు, ఓసీపీ-1, 2లో గ్రేడర్స్ డోజర్స్, వాటర్ ట్యాంకర్స్ అందుబాటు ఉంచాలని, రాణీ రుద్రమదేవి స్టేడియంలో ఓపెన్ జిమ్ పరికరాలు అమర్చడం, కోతుల బెడద నివారణ చర్య చేపట్టాలని చర్చించారు. వారికి జీఎంలు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్ట్రక్చర్ కమిటీ సభ్యులు వైవీ రావు, తిరుపతి రావు, గంగాధర్, ఎస్‌వోటు జీఎంలు బండి సత్యనారాయణ, బీవీ సత్యనారాయణ, అధికారులు రాజశేఖర్, ప్రవీణ్, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం

మంథని, మే 13 : వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం మంథనిలో పాక్షికంగా మంగళవారం ధ్వంసమైంది. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌పై ఉన్న ఐలమ్మ విగ్రహం రోడ్డు ప్రమాదంలో చేయి విరిగి పాక్షికంగా ధ్వంసమైంది. పాత ఇనుప సామగ్రి లోడ్‌తో ట్రాలీ వెళ్తుండగా, చాకలి ఐలమ్మ విగ్రహానికి తగలడంతో చేయి వీరిగింది. దీంతో రజక సంఘం నాయకులు, పోలీసులు అక్కడికి చేరుకొని ఘటనపై ఆరా తీసి ప్రమాదాన్ని కారణమైన పాత ఇనుప సామను యజమానితో తిరిగి విగ్రహం రిపేర్ చేయించారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి ఇబ్బందులు లేకుండా మున్సిపాలిటీ వారి చర్యలు చేపట్టాలని రజక సంఘం నాయకులు కోరారు.

## బాధిత కుటుంబానికి పుట్ట మధూకర్ పరామర్శ



పరామర్శిస్తున్న పుట్ట మధూకర్

మంథని, మే 13: పట్టణంలో గట్టు రాధాకిషన్ తల్లి పద్మావతి ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు

ఫర్టిలైజర్‌సిటీ, మే 13: సరస్వతీ నది పుష్కరాలకు గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కాళేశ్వరానికి ఈ నెల 15 నుంచి 26 వరకు ప్రతి రోజూ పది ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. వయా శ్రీరాంపూర్‌కాలనీ, చెన్నూరు మీదుగా కాళేశ్వరం పుష్కరఘాట్ వద్దకు బస్సు పార్కింగ్ ఉందన్నారు. పెద్దలకు రూ. 150, పిల్లలకు రూ.80 చొప్పున బస్సు చార్జీలు ఉంటాయని, మహిళల మహాలక్ష్మీ స్కిమ్ కూడా వర్తించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 9441335701ను సంప్రదించాలన్నారు.

## రత్నాపూర్‌లో ఇండస్ట్రియల్ కారిడార్‌కు సమ్మతి

రామగిరి, మే 13 : తమ గ్రామ శివారులో ప్రభుత్వం తలపెట్టిన ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ రత్నాపూర్ గ్రామ రైతులు హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును మంగళవారం కలిసి తమ అంగీకారం తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని, కొకకోలా కంపెనీ ఈ ప్రాంతంలో నెలకొల్పడం ద్వారా నిరుద్యోగ యువతకు ఇక్కడే మెరుగైన ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి వారికి బదులిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు కొండ్రు అంజన్న, కొడాలి సది, వెంకటేశ్, పోచం, శ్రీనివాస్, రాంచందర్, రాయమల్లు, గట్టయ్య, రవీందర్, రాజు, సురేశ్, కొమురయ్య, లక్ష్మణ్, రాజేశ్, నారాయణ, సదానందం, శ్రీనివాస్, అరవింద్ ఉన్నారు.